

# విభూతి మహిమ

రాధిక

నా స్నేహితురాలు శుభ వాళ్ళ అమ్మమ్మ గారి ఊరు వెళదామని చాలా కాలంగా పోరు పెడుతోంది. అది పల్లెటూరు. పట్నంలో పుట్టి పట్నంలోనే పెరిగిన నాకు పల్లెలు చూడాలని చాలా కాలంగా ఆశ. ఆ ఆశ తీర్చుకోడానికి శుభ పునాది వేసింది. అందరమూ మా అంగీకారంతో తలో చేయి వేసి భవనాన్ని సిద్ధం చేశాము. ఆ భవనం పేరు "పిక్నిక్"!

మొత్తానికి చాలా సరదాగా అందరం బయలుదేరాం. ఆ పల్లెలో అడుగు పెట్టిన నా మనసు పురి విప్పిన నెమలిలా గంతులు వేసింది. చుట్టూ పచ్చని పొలాలు. ఎక్కడ చూసినా కొబ్బరి తోటలు - అక్కడి ప్రకృతి పచ్చని పట్టు పరికిణీ కట్టుకుని, చెట్టునే ఎర్రగా పండిన మిరప తోటలా ఎర్రని వోణీ వేసుకుని, మినప రైక తొడుక్కుని, పండిన నిమ్మ రంగు మేనితో, దానిమ్మ గింజలాంటి పలు వరుసతో మల్లెల్లాంటి నవ్వుతో బంతి పూల జడ వేసుకుని, చీకటి కాటుక దిద్దుకుని, వెన్నెల బొట్టు పెట్టుకుని, అమాయకత్వం నిజాయితీ మంచితనం జడ కుప్పెలుగా చేసుకుని ఆప్యాయతలనే నగలు సింగారించుకుని వయ్యారంగా నడుస్తున్నట్టు అనిపించింది.

నా చెవిలో ఆ కన్య గజ్జెల గలగల వినిపించింది.

అందులో అంతర్గతంగా నేను లీనమై పోయాను. నీలాల నింగిని అందుకున్నంత సంబరపడిపోయింది నా మనసు.

శుభ వాళ్ళ అమ్మమ్మ తాతయ్యల ఆదరణ, లేని వారి పట్ల వారి వితరణ, నన్ను ఊపిరి తీసుకోనివ్వనంత ఆనంద డోలికల్లో ముంచాయి. అదేదో వింత ప్రపంచంలా, ఆ ప్రపంచంలో అంత ప్రశాంతతే అన్నట్లుగా ఊహించుకుంటున్న నా ఊహలను తల్లక్రిందులు చేస్తూ ఆ రోజే ఒక సంఘటన జరిగింది. కమ్మని కల చెదిరిపోయింది. శుభ వాళ్ళ పని మనిషి కూతురికి వాంతులు, విరేచనాలు అవుతుంటే డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళడం మాని ఆ ఊరి స్వాముల వారు అట - ఆయన దగ్గరకు తీసుకెళ్ళి విభూది ఇప్పించారు.

అసలు నాకు ఆ అమ్మాయిని చూస్తే కలరా ఏమో అన్నంత భయం వేసింది. డాక్టర్‌కి చూపించని వాళ్ళ మూర్ఖత్వం మీద - మూఢ నమ్మకం మీద చెప్పలేని ఆగ్రహం కలిగింది. పోనీ పనమ్మాయి అయితే చదువు లేనిది, చదువుకున్న శుభ కుటుంబం కూడా స్వామీజీ దగ్గరకు వెళ్లమని సలహా ఇస్తుంటే నాకు విపరీతమైన ఆశ్చర్యం వేసింది.

అదే విషయం అడిగితే అమ్మమ్మగారు ఇలా చెప్పారు - "ఏం చెప్పమంటావు, సీమా, మా పల్లెటూరి వారి సంగతి - దేశం ఎంత ముందుకి పోతున్నా ఈ మూఢ నమ్మకం వారిని వదలడం లేదు. మరి అదేమి చిత్రమో విచిత్రంగా ఆ స్వామీజీ ఇచ్చిన విభూదికే అన్ని రోగాలూ నయమవుతూన్నాయి. నేను నా కళ్ళతో ఎన్నో కేసులు చూశాను. నీ కళ్ళతో నువ్వు చూశావుగా. ఆ పిల్ల చూడు ఎలా లేచి తిరుగుతుందో! మరి ఆ మహిమలు నమ్మకుండా ఎలా ఉండమంటావు. ఈ ఊరికి గవర్నమెంటు ఆసుపత్రి ఉందిగాని, అందులో డాక్టర్ ఎప్పుడూ ఉండడు. ఇక్కడికి ఎవరూ రావడానికి ఇష్టపడరు. ఒకవేళ వచ్చినా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవాలిగాని ఆస్పిటల్ ఛాయలకు ఎవరూ వెళ్ళరు. విసుగెత్తి ఆ డాక్టర్లే ఊరు వదలి వెళ్ళిపోయారు. మాకు విభూది మహిమే మందులా పని చేస్తోంది" అని చెబుతుంటే ఆశ్చర్యపోయాను.

ఇప్పుడు ప్రస్తుతం ఉన్న స్వామీజీ మూడు సంవత్సరాలుగా అక్కడ ఉంటున్నారట. ఆయన చేతి విభూతి తీసుకున్న వాళ్ళందరూ ఆరోగ్యంగానే ఉన్నారట.

నాకు ఆ స్వామీజీని చూడాలనిపించింది. అందరం సాయంకాలం ఆయన మీదకు దండ యాత్రకు బయలుదేరాం. అందరూ మామూలుగానే వచ్చారుగాని, నేను మాత్రం సి. ఐ. డి. లా ఆయన్ని పరిశీలించసాగాను.

చూడగా చూడగా ఆయన్ని ఎక్కడో చూసినట్లు అనిపించింది. ఆ ముఖ కవళికలు నాకు బాగా పరిచయం ఉన్నట్లు అనిపించసాగాయి. గడ్డాలు, మీసాలు నుదుట బొట్లు అడ్డు రావడంతో నాకు పోల్చుకోవడం కష్టంగా ఉంది. ఎంత ఆలోచించినా ఆయ నెవరో గుర్తుకి రావడం లేదు.

అదే విషయం నా స్నేహితులతో చెబితే వాళ్ళు "నీవన్నీ అనుమానాలు" అంటూ కొట్టిపారేశారు నా మాటని.

ఆ స్వామీజీ ఎదురుగా చాలా మంది రోగులు ఉన్నారు. ఆయన ఇచ్చే విభూది కోసం పడిగాపులు పడి ఉన్నారు. ఆయన రోగులు చెప్పేది విని, మనసులో దేవుణ్ణి ధ్యానించి వాళ్ళ నుదుటను విభూది బొట్టు పెట్టి అదే విభూది కాస్త నోట్లో వేస్తున్నారు. "అసలు ఇలా మంత్రాలతో జబ్బులు నయమవుతుంటే - ఇంత సైన్స్ ఎందుకు, ఇన్ని మెడికల్ కాలేజీలు, ఇంత మంది డాక్టర్లు ఎందుకు?" అనిపించింది.

ఆయనతో మాకు ఇంటర్వ్యూ లభించింది. అందరూ ఏవేవో ప్రశ్నలు అడిగారు. నేను మాత్రం "మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుంది" అని అన్నాను. దాని కాయన చిరునవ్వు నవ్వారు. ఆ నవ్వును బట్టి పోల్చుకున్నాను. ఆయన మా పక్కింట్లో ఉండేవారు. చాలా కాలం పరిచయం మాది. ఇంటర్‌లో ఆయన ఉన్నప్పుడు నేను తొమ్మిదో తరగతి చదివేదాన్ని. చాలా సంవత్సరాల క్రితం విడిపోయినందున త్వరగా గుర్తించలేకపోయాను నేను ఆయన్ని.

అందరూ మాట్లాడుతుంటే మెల్లగా ఆ చుట్టు ప్రక్కల పరిశీలించసాగాను. అప్పుడు దొరికాయి నాకు కొన్ని ఆధారాలు. దొంగా దొరికాడు. ఆయన రోగుల నోట్లో వేసే విభూదితో ఇంగ్లీషు మందులు నూరి కలిపి విభూది అంటూ మింగిస్తున్నాడు. ఆయన ఆ ఊరి గవర్నమెంట్ డాక్టర్‌గా వచ్చి - వాళ్ళతో తరిమివేయబడి వాళ్ళ మనస్తత్వాన్ని బట్టి స్వామీజీ రూపంలో ట్రీట్‌మెంట్ ఇస్తున్నాడు. "వారెవా" అనుకున్నాను. ●

